


నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం

# తెలుగింటి అనుబంధాలకు సాక్షి ద్వివేదుల విశాలాక్షి

మధ్య తరగతి జీవితాలను ద్వివేదుల విశాలాక్షిగారు చిత్రించినట్టుగా వేరొకరు చిత్రించలేరు. ఆ తరగతి అభిమానులను, అనుమానాలను ఆమె అక్షరీకరించిన పద్ధతి నేర్చుకుందామన్నా రాదు. అచ్చ తెలుగు అనుబంధాలు, ఆత్మీయతలకు ఆమె రచనలు పెట్టింది పేరు. ఒక దశలో ద్వివేదుల విశాలాక్షి రచనలు చదువుతున్నారంటే...మా పిల్లలు మంచి పుస్తకాలే చదువుతున్నారు. మంచి అలవాటే! కుటుంబ పెద్దలను గౌరవించడం తెలుసుకుంటారు. కుటుంబ మర్యాదలను గుర్తిస్తారనే వారంతా. పెళ్ళి కావాల్సిన పిల్ల 'రుక్మిణి కల్యాణం' చదివితే పెళ్ళయిపోతుందన్నది ఎలా ప్రచారమయిందో అలాగే విశాలాక్షి గారి నవలలు చదివితే అత్తారింట అమ్మాయి ఎలా మసలుకోవాలో తెలుసుకోగలుగుతుంది...అన్న మాట కూడా అంతగానే ప్రచారమయింది. అంతటి రచయిత్రి విశాలాక్షిగారితో ఈవారం ఇంటర్వ్యూ..

## మీ బాల్యం గురించి చెప్పండి?

మాది విశాఖ జిల్లాలోని విజయనగరం. వైదిక బ్రాహ్మణ దంపతులు పంతుల పాపారాయుడు, నారాయణమూర్తిలకు 15 ఆగస్టు 1929న నేను జన్మించాను. నన్ను స్కూల్ ఫైనల్ వరకు చదివించారు. నిజానికి మా రోజుల్లో చాలా చిన్న వయసులోనే పెళ్లిళ్లు జరిగేవి. అయితే మా నాన్నగారు మాత్రం నాకు పదిహేనవ ఏట నరసింగరావుగారితో వివాహం జరిపించారు.

## మిమ్మల్ని రచయితగా ప్రోత్సహించిందెవరు?

ఇంకెవరు? నా భర్త నరసింగరావుగారే! నా రచనా వ్యాసంగానికి అవసరమయిన వాతావరణాన్ని మావారు కల్పించారు. అన్ని సదుపాయాలనూ అందించారు. ఇక్కడో విషయం చెప్పాలి. ఆ రోజుల్లో ఇప్పుడున్నన్ని తెలుగు పత్రికలు లేవు. ఉన్నా అవి అందరికీ అందుబాటులో ఉండేవి కావు. మా వారి ఉద్యోగ రీత్యా మద్రాసులో ఉండేవాళ్లం. ఆయన అమెరికాకు చెందిన విద్యా ఉద్యోగ పరివ్యాప్తికోసం ఏర్పడిన 'ఫుల్ బ్రైట్ ఫౌండేషన్'లో జాతీయ స్థాయి అధికారి. దీంతో మాకు ఆనాటి తెలుగు పత్రికలన్నీ అందుబాటులో ఉండేవి. మేము మద్రాసులో ఉండటం మూలాన అక్కడి ప్రముఖ రచయితలందరితో నాకు సన్నిహిత సంబంధమేర్పడింది.

## ఎప్పటినుంచి రచనలు చేస్తున్నారు?

నేను కాస్త ఆలస్యంగానే రచనా రంగంలోకి అడుగు పెట్టాను. ముందు కొన్ని రాసినప్పటికీ 1965లో రాసిన 'వైకుంఠపాళి' నవల చెప్పుకోదగ్గది. ఆ రోజుల్లో వార పత్రికల్లో ఎక్కువగా స్త్రీల సీరియల్స్ వచ్చేవి. వాటిని చూసి నేనూ రాయడం మొదలు పెట్టాను. 'వైకుంఠపాళి' నవల తర్వాత వరుసగా మారిన విలువలు, కొవ్వొత్తి, గ్రహణం విడిచింది, వారధి, హరివిల్లు, గోమతి, ఎక్కవలసిన రైలు, రేపటి వెలుగు, జారుడు మెట్లు, కలకానిది, పరిహారం, ఎంతదూరమీ పయనం... ఇలా చాలా నవలలు రాశాను.

## నవలలేనా, కథలు కూడా రాశారా?

ఎందుకు రాయలేదండి. కథలు కూడా రాశాను. అప్పట్లో పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు, విద్వాన్ విశ్వంగారు లాంటి మహామహులు పత్రికల సంపాదకులుగా ఉండేవారు. ఆనాడు కూడా సంక్రాంతి, దీపావళి లాంటి సందర్భాలలో ప్రత్యేక సంచికలు వెలువరించేవారు. అలాంటి సంచికల్లో నా కథలు తప్పకుండా ఉండేవి. ఏ పత్రిక సంపాదకుడు అడిగినా వెంటనే కథ రాసి ఇచ్చేదాన్ని. 'ఆమెకోరిక', 'భవబంధం', 'ద్వివేదుల విశాలాక్షి కథలు' పేరిట నా కథలన్నీ మూడు సంపుటాలుగా వచ్చాయి. కథలే కాదు, 'సుమన' అనే పేరుతో నేను వందకు పైగా పుస్తకాలను సమీక్షించాను.

## మీరు పొందిన అవార్డుల గురించి చెప్పండి..

చాలానే ఉన్నాయి. 'ద్వివేదుల విశాలాక్షి' కథల సంపుటికి 1996లో జ్యేష్ఠ లిటరరీ అవార్డు లభించింది. మద్రాసు వారినుంచి 'గృహలక్ష్మి స్వర్ణ కంకణం', ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు, రావిశాస్త్రి స్మారక పురస్కారంతో పాటు చాలానే అవార్డులు అందుకున్నాను. 1998లో తెలుగు యూనివర్శిటీ నాకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఇక నా రచనలపై ఆంధ్రాలోని దాదాపు అన్ని యూనివర్శిటీలనుంచి చాలామంది పిహెచ్‌డి, ఎంఫిల్ చేశారు.

> జీవితాంతం తోడుంటారనుకున్న నా భర్త నాకన్నా ముందే కన్నుమూశారు. తర్వాత మా మొదటి కుమారుడు శ్రీనాథ్ హఠాన్మరణం.. ఆ తర్వాత మా అల్లుడు కూడా కన్నుమూశారు. నా జీవితంతో విడదీయరాని అనుబంధం ఉన్న ఆ ముగ్గురిని మృత్యువు కబళించింది. దీంతో నాకు జీవితంపై నిర్మోహత్వం ఏర్పడింది.

## మీ రచనలు ఇతర భాషల్లోకి అనువాదమయ్యాయా?

1968లో 'వారధి' అనే నవల రాశాను. దానిని నేషనల్ బుక్‌ట్రస్టు వారు 14 భారతీయ భాషలలోకి అనువదించారు. మరి కొన్ని నవలలు హిందీ, కన్నడ భాషల్లోకి అనువాదం జరిగాయి. 'వారధి' నవలను 1969లో 'రెండు కుటుంబాల కథ' పేరిట సినిమా తీశారు. 'వస్తాడే మా బావ' అనే చిత్రానికి సంభాషణలు రాశాను.

## ప్రస్తుతం రచనలు చేయడం లేదు. ఎందుకని?

చూస్తున్నారుగా.. వృద్ధాప్యం. ప్రతి మనిషికీ తప్పదు. బహుశా నరసింగరావుగారు నాకు భర్త కాకుండా ఉంటే నేను రచయిత్రిని అయ్యేదానినే



కాదేమో. అంటే అంతగా ఆయన నా జీవితంపైన ప్రభావం చూపారు. ఆయనతోపాటు ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో పర్యటించాను. అలా ఎన్నో దేశాల ప్రజల సాధక బాధకాలను చాలా దగ్గరనుంచి చూసే వీలు కలిగింది. జీవితాంతం తోడుంటారనుకున్న ఆయన నాకన్నా ముందే కన్నుమూశారు. తర్వాత మా మొదటి కుమారుడు శ్రీనాథ్ హఠాన్మరణం.. ఆ తర్వాత మా అల్లుడు కూడా కన్నుమూశారు. నా జీవితంతో విడదీయరాని అనుబంధం ఉన్న ఆ ముగ్గురిని మృత్యువు కబళించింది. దీంతో నాకు జీవితంపై నిర్మోహత్వం ఏర్పడింది. రాయాలనే ఆశక్తీ లేదు, చదివే ఓపికా లేదు. దేనిపైనా ఆశలేదు. ఇలాంటి సమయంలో మీరు వచ్చారు. మిమ్మల్ని నొప్పించడం ఇష్టం లేక ఆయాసంతో ఈ నాలుగు మాటలు..(అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నారు)!!

–భరాగో

# నాకు నచ్చిన నా కథ

# మనస్విని

- ద్వివేదుల విశాలాక్షి

**ఆ రోజు పాపకి తలంటి నీళ్లు పోసి, కొత్త బట్టలు తొడిగి మొదటి పుట్టిన రోజు పండుగ చేసింది కాంతమ్మ. పిండి వంటలతో భార్య పెట్టిన భోజనం ఆరగించి, భుక్తాయాసంతో పడక గదిలో మంచంపై పరమేశం కునుకు తీయబోతుంటే, వీధి తలుపు ఎవరో కొడ్తున్నట్లు చప్పుడు వినిపించింది. 'ఆc! మిట్ట మధ్యాహ్నం ఎండలో పడి తమ ఇంటికి ఎవరొస్తారు? పక్కింటి ప్లీడరు గారి కోసం ఎవరో పార్టీ అయి ఉంటుందిలే' అనుకొని, లేవడానికి బద్ధకించి ఇటు నుంచి అటు తిరిగి మళ్లీ పడుకున్నాడు.**

వంట ఇంటి ముందు వరండాలో కూర్చుని తనలో తనే ఏదో సన్నగా పాడుకుంటూ మధ్యాహ్నం పేరంటంలో ఇవ్వడానికి తమలపాకుల కిళ్లీలు కడ్తోంది భార్య కాంతం. దూరంగా పెరట్లోంచి పిల్లల ఆటపాటల కేకలు కలగలుపుగా వినిపిస్తున్నాయి. అంతలోనే మళ్లీ వీధి తలుపు టక టక కొట్టిన చప్పుడు అయింది.

''ఏమండీ! ఎవరో తలుపు కొడుతున్నారు. ఓసారి వెళ్లి ఎవరో ఏమిటో చూడండి. నా చెయ్యి తెరిపిగా లేదు'' అంటూ లోనుంచి కాంతమ్మ కేక పెట్టింది.

ఇంక తనకి లేవక తప్పదు అనుకొని విసుక్కొంటూనే లేచి వెళ్లి తలుపు తీసాడు పరమేశం. ఎదురుగా ఎవరో కొత్త వ్యక్తి. అంతకు పూర్వం అతన్ని ఎక్కడా చూసిన గుర్తు లేదు. బహుశా వాలకం చూస్తే చాలా దూరం నుంచి, చాలా రోజులుగా ప్రయాణం చేసి మిట్ట మధ్యాహ్నం ఎండలో ఆ ఊరికి చేరిన వాడిలా ఉన్నాడు.

వేళకాని వేళప్పుడు వచ్చి, బంగారం లాంటి తన నిద్ర పాడుచేసిన ఈ ఆగంతకుడు ఎవరబ్బా- అనుకుంటూ ఎదుట నిలిచిన వ్యక్తి వైపు పరీక్షగా చూసాడు పరమేశం. మనిషి బాగా పొడగరి. ఆ పొడుగుకి తగ్గ లావు. భారీ అయిన పంచలోహపు విగ్రహంలా నిండుగా ఉన్నాడు. వయసు అరవై పైబడి ఉండొచ్చు. మాసిన గడ్డం, నెరసిన జుట్టు, ప్రయాణపు బడలికతో వడలిన ముఖం, నలిగిన బట్టలు, కాళ్లకి మట్టి కొట్టుకున్న చెప్పులూ-పరమేశం ఎంత పరీక్షగా చూసినా ఆ ఆగంతకుడు ఎవరో, ఎక్కడివాడో అతనికి గుర్తు దొరకలేదు. అతను తన కోసం కాక ఇరుగు పొరుగు ఇంకెవరి కోసమో వచ్చి ఉండాలి. ఇంటి వివరాలు సరిగ్గా తెలియక వాడలో ముందుగా ఉన్న తమ ఇంటి తలుపు తట్టి ఉండాలి అనుకొన్నాడు. అతడికి కావలసిన వివరాలు ఏవో తొందరగా చెప్పి పంపిస్తే, తను మళ్లీ తన నిద్రా కార్యక్రమం కొనసాగించవచ్చు అన్న అభిప్రాయంతో, వీధి గడపలోకి ముందుకి వస్తూ, ''ఎవరండీ! మీకు ఎవరు కావాలి?'' అన్నాడు.

''పరమేశం గారిల్లు ఇదేనాండీ?'' అంటూ ఎంతో నిదానంగా, పరమేశాన్ని పట్టి చూస్తూ ప్రశ్నించాడు అతను.

''అవును.. ఇదే. నేనే పరమేశాన్ని.''

''క్షమించాలి. వేళ కాని వేళ వచ్చి ఇబ్బంది పెడుతున్నాను'' అన్నాడు అతను నొచ్చుకుంటున్న ధోరణిలో.

''ఫరవాలేదు చెప్పండి'' అన్నాడు పరమేశం. లోలోపల విసుక్కొంటున్నా పైకి సభ్యత కోసం మామూలుగా ముఖం పెట్టి.

''నా పేరు రంగస్వామి. మాది ఈ ప్రాంతం కాదు. ఈ పేపరులో ప్రకటన మీరే వేయించి ఉంటారనుకొని...'' అంటూ సగంలో మాట ఆపి, పాతబడిన ఒక చిన్న పేపరు కటింగ్‌ని లాల్చీ జేబులోంచి తీసి పరమేశం చేతికందిచ్చాడు అతను.

పాప తమ ఇంట కాలుపెట్టి వారాలకి వారాలే, నెలలకి నెలలే గడిచిపోతున్నా, 'ఈపిల్ల మా బిడ్డ' అంటూ పాప కోసం ఎవరూ రాకపోవడంతో-ఏం చెయ్యాలో పాలుపోక మిత్రుల సలహా మేరకే ఆ ప్రకటన తను వేయించాడు పరమేశం. అప్పటికే పాపతో అనుబంధం పెంచుకొంటున్న భార్య ఆ పిల్ల మీదా ఇంకా మమత పెంచుకోక ముందే, ఆ తల్లిదండ్రులెవరో వచ్చి పాపని తమతో తీసుకువెళితే మంచిదన్న అభిప్రాయంతో ఆ పని చేసాడు.

అది జరిగి కూడా నెలలు గడిచిపోతున్నా, అంత కాలం దాకా ఎవరూ రాకపోవడంతో ఇంక పాప కోసం ఎవరూ రారనీ, పాప తమదే అన్న భావంతో వారుండగా, ఇప్పుడీ ఆగంతకుడు ఎవడో, ఎక్కడి నుంచో, ఉరవని పిడుగులా ఊడిపడి, ఈ ప్రకటన ఇచ్చింది మీరేనా? అని వాకబు చేస్తున్నాడు. ఇతడు నిజంగా పాపకి బంధువో, శ్రేయోభిలాషో అయి ఉంటే, ఇంతకాలం దాకా పిల్ల గురించి పట్టించుకోకుండా ఉండడం ఎలా జరుగుతుంది? ఇందులో ఏదో మోసం ఉండి ఉంటుంది. ఏవో మాయ మాటలు నాలుగు చెప్పి అందమైన ఆడపిల్లల్ని ఎత్తుకుపోయి, సాని కొంపలకి అమ్మే ముఠా ఒకటి ఈ చుట్టు పక్కల ఊళ్లల్లో తిరుగుతున్నట్లు పత్రికల్లో వార్తలు చూస్తున్నాడు. ఎదుట ఉన్న వ్యక్తి ఆ కోవకి చెందినవాడు కాదు అని చెప్పడానికి ఆధారాలేం లేవు. పైకి చూడ్డానికి మనిషి సౌమ్యుడుగా, మంచీ మర్యాదా తెలిసిన వాడిలా కనిపిస్తున్నాడు. ఇంటి లోపలకి పిలిచి, 'మాటల్లో పెట్టి, జాగ్రత్తగా నాలుగు ప్రశ్నలు వేస్తే అసలు రంగు బయట పడకపోదు అనుకున్నాడు పరమేశం.

తన మనోభావాలు పైకి పొక్కకుండా జాగ్రత్త పడుతూ ''రండి.... లోపలకి రండి... అలా బయట గుమ్మలోనే ఉండిపోయా''రంటూ అతడిని సాదరంగా లోపలకి ఆహ్వానించాడు. కాళ్లు కడుక్కోవడానికి నీళ్లిచ్చేడు. కూర్చోవడానికి కుర్చీ చూపి, వంట ఇంట్లోకి వెళ్లి ఒక గ్లాసుతో చల్లని మజ్జిగ తెచ్చి ముందు పెట్టాడు. అతడు అది తాగి, కాస్త సేద తీరాక ''ఇప్పుడు చెప్పండి మీరు వచ్చిన పనేమిటో?'' అంటూ మర్యాదగా ప్రశ్నించాడు.

ఒక్క నిమిషం పాటు అతడు మాట్లాడలేదు. చేతిలో మడిచి పెట్టుకొన్న ఆ పేపరు కటింగ్ వైపు చూస్తూ అలాగే ఉండిపోయాడు.

ఏం కథ చెప్పి ఎలా ఇతన్ని బుట్టలో వెయ్యాలా అని ఆలోచిస్తున్నాడులా ఉంది ముసలాడు-అనుకొన్నాడు పరమేశం.

''ఈ ప్రకటన చాలా ఆలస్యంగా నా కంట పడింది. నాకు చేరిన ఈ కాపీలో ప్రింటు అంత బాగా లేదు. అందునా పత్రిక పాతబడి, నలిగి ఉన్న కారణాన ఫోటోలో ఉన్న పిల్ల రూపు సరిగా పోలిక పట్టడానికి వీలు లేదు. ఈ ప్రకటన చూసే వరకు, తల్లిదండ్రులు, తాత, నాయనమ్మలతో పాటు తను కూడా దారుణ అగ్ని ప్రమాదంలో కాలి బూడిద అయిపోయిందనే అనుకొన్నాను. మీరు అంటున్న ఈ పాప నా మనుమరాలు అవునో కాదో నాకు తెలియదు. అవునేమో అన్న ఆశతో ఇంత దూరం వచ్చాను.'' ఒక్కొక్క మాటే ఆపి ఆపి నెమ్మదిగా అంటున్నాడు అతడు. చివరి మాట అతని నోట తిన్నగా పెగిలిరాలేదు. దుఃఖ భారంతో అతడి గొంతు పూడిపోయింది. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అది కేవలం నటనో, నిజమైన దుఃఖమో పోల్చుకో

లేకపోయాడు పరమేశం.

ముసలాయన కళ్లు తుడుచుకొని మళ్లీ చెప్పడం మొదలు పెట్టాడు. ''మల్లారం మరిడిమాంబ తిరునాళ్లతో జరిగిన దుర్ఘటన గురించి మీరు వినే ఉంటారు.''

మల్లారం వారి పొరుగు గ్రామమే. ఆ దుర్ఘటన గురించి వినడమే కాదు. ఆ జాతరలో జరిగిన బీభత్సాన్ని కళ్లారా చూసాడు పరమేశం. తల వెంట్రుక వాసిలో చావు తప్పి బయటపడింది అతని కుటుంబం. ఆనాటి సంఘటన తలుచుకుంటే, ఇంతకాలం గడిచినా ఇప్పటికీ అతడికి ఒళ్లు గగుర్పొడుస్తుంది.

***

ఆరోజు మల్లారం గ్రామ దేవత మరిడిమాంబ తిరునాళ్ల పండుగ. ఎంతెంత దూరం నుండో ప్రజలు తండోప తండాలుగా వచ్చి చేరారు. ఆ తల్లికి మొక్కిన ఏ మొక్కూ తీరకుండా పోదనీ, అంత మహాత్మ్యం గల దేవత మరిడిమాంబ అని ప్రతీతి. ఎక్కడెక్కడి నుంచో వస్తారు భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి.

మరిడిమాంబ గుడి ఉన్న వీధి అంత విశాలమైంది కాదు. అందునా దారికి ఇటు అటు పాకలు వేసి దుకాణాలు పెట్టారు. వరుసగా పది మంది జట్టుకట్టి నడవడానికి అవకాశం లేని ఆ ప్రదేశంలో వందలు, వేల మనుషులు, ఇసుక వేస్తే రాలనంతగా ఉన్నారు జనం. ఉత్సవం బ్రహ్మాండంగా జరుగుతోంది. పులివేషాలు, బిళ్ల వేషాలు, సాముగరిడీలు, చెక్క భజనలు, పగటి వేషాలు, బుట్టబొమ్మలు, ఒకటేమిటి అటువంటి పండుగ సమయాల్లో ఉండవలసిన అన్ని హంగులతో జాతర సాగిపోతోంది.

అంతలో జరిగింది ఆ దారుణ సంఘటన. గ్రామంలోని రెండు ప్రత్యర్థి ముఠాల మధ్య చెలరేగిన విద్వేష పూరితమైన బాణాసంచా పోటీ. ఎవరు ఎటు వైపు విసురుతున్నారో గుర్తించకుండా మందుగుండు సామాగ్రి కాల్చడం మొదలుపెట్టారు. కాల్చిన ఔట్లు, తారాజువ్వలు దారికి ఇటూ అటు ఉన్న పాకలపైనా, యాత్రికుల విశ్రాంతి కోసం వేసిన పందిళ్ల పైనా పడి, ఒక్కసారిగా నాలుగు



వైపుల నుంచి మంటలు లేచాయి. అదే సమయంలో ఒక చోట, కుప్పగా పోసిన బాణాసంచా అంటుకుంది.

ఆ ఇరుకు సందులో, ఆకాశాన్ని తాకుతున్న మంటల్లో అసంఖ్యాక జనసందోహపు ఒత్తిడిలో, ఎంత మంది చిన్నా, పెద్దా, ముసలీ, ముతకా మృత్యుదేవతకి ఉపాహారం అయ్యారో ఎవరూ చెప్పగలిగే పరిస్థితి లేదు. ఎక్కడెక్కడి నుండో జాతర చూడాలని ఉత్సాహంతో వచ్చిన వారు ఆ తల్లి గుడి ముందు బూడిద పోగులుగా మిగిలిపోయారు. అంతకు కొద్దిసేపటికి ముందు ఆనందోత్సాహాలతో పరవళ్లు తొక్కుతున్న ఆ ప్రదేశమంతా అంతలోనే పెద్ద శ్మశానంగా మిగిలిపోయింది. జరిగిన ధన ప్రాణ నష్టాలు ఎవరి అంచనాలకు అందకుండా పోయాయి.

వెనక నుంచి వెంట తరుముతున్న మంటలతో, జనసందోహపు ఆర్తనాదాలతో బీభత్సంగా మారిన ఆ ప్రదేశం నుంచి, ప్రాణాలరచేతుల్లో పెట్టుకుని, అందుకొన్న పరుగు ఆపకుండా పరిగెత్తి క్షేమంగా ఇల్లు చేరుకున్నారు పరమేశం కుటుంబం. వణుకుతున్న చేతులతో, ఇంటి తలుపు తాళం తీసి, వారు లోపలకి రాబోతుంటే, ఎవరో చిన్న పిల్ల వెక్కి వెక్కి ఏడుస్తూ వీధి అరుగు నీడలో కనిపించింది. ఆ పాప బట్టలు చిరిగి ఉన్నాయి. వంటి మీద అక్కడక్కడ గీరుకున్న దెబ్బలున్నాయి.

''ఎవరు పాపా నువ్వు? మీ వాళ్లు ఎక్కడున్నారు?'' అని ప్రశ్నిస్తే అంత వరకూ మెల్ల మెల్లగా ఏడుస్తున్నదల్లా ఒక్కసారిగా గొల్లున ఏడవడం మొదలు పెట్టింది. ఎవరో పిల్ల జాతరలో తప్పిపోయి ఇటు వచ్చి ఉంటుంది. లేక ఏ దొంగ వెధవో ఒంటి మీద నగా నట్రా ఒలుచుకొని పిల్లని ఇక్కడ విడిచి ఉంటాడు. ఎలా జరిగినా తెల్లారేసరికి వాళ్ల వాళ్లు రానే వస్తారు. ఈ రాత్రికి ఇంటికి తీసుకుపోయి, కాస్త బుజ్జగించి ఇంత తిండి పెట్టి నిద్ర బుచ్చితే సరి అనుకున్నారు. దెబ్బలు తుడిచి, మందు రాసి, బురద కొట్టుకున్న బట్టలను విడిపించి వేరు బట్టలు తొడిగింది కాంతమ్మ. ఎవరు ఎంతగా బ్రతిమాలినా పాప, ఆరాత్రికి తినడం, తాగడం ఏమీ చెయ్యలేదు. అలా వెక్కి వెక్కి ఏడుస్తూనే ఎప్పుడో నిద్రలోకి జారిపోయింది.

తెల్లవారి జాము పొద్దెక్కినా పాప కోసం ఎవరూ రాలేదు. పాప తన ఊరూ, పేరు గాని, తన వారి గురించి గాని ఎటువంటి సమాచారం ఇవ్వడానికి సిద్ధంగా లేదు. ఎవరు తన గురించి ప్రశ్నలేసినా బావురుమని ఏడవడం మొదలు పెట్టేది. ఆ ఏడ్పులోనే కొయ్యబారిపోయి, ఫిట్సు వచ్చినదానిలా కాళ్లు, చేతులూ బిగపెట్టేది. ఎంతో ఓర్పుతో కాంతమ్మ పదే పదే బ్రతిమిలాడి, బుజ్జగించి ఆ పూటకి కాస్తంత పెరుగు అన్నం మాత్రం తినిపించగలిగింది.

ఊరు ఊరంతా రాత్రి జరిగిన ఘోరకలితో ఉడికి పోతోంది. చావగా మిగిలినవారు, తప్పిపోయిన తమ పిల్లల కోసం, సమీప బంధువుల కోసం, వీధులూ, తోటలు, సమీప పొలాలు, నూతులు, గోతులు వెతుకులాడ్డం మొదలుపెట్టారు. గ్రామస్తుల ఇళ్లల్లో ఆ రాత్రికి తలదాచుకున్న పై ఊర్ల జనం అందిన వాహనాన్ని పట్టుకొని తమ తమ ఊళ్లకి పోసాగారు.

ఫైరింజన్లు, అంబులెన్సులు, పోలీసు జీపులు, నేరస్తుల కోసం గాలింపులూ, అరెస్టులూ, ఊరు ఊరంతా ఒకటే గడ బిడగా ఉంది. తమ ఇంటి ముందుకి ఎవరు వచ్చినా ఏ పాటి సడి అయినా పాప కోసమే ఎవరో వచ్చారనుకొని తలుపు తియ్యసాగేరు పరమేశం దంపతులు. ఆరోజు, మరురోజు, వరుసగా నాలుగు రోజులు గడిచినా పాప కోసం ఎవరూ రాలేదు. ఊరు చల్లబడింది. ఊరిలో కొత్త ముఖాలు పలుచబడ్డాయి. మరిడిమాంబ గుడి ముందు బూడిద పోగుల్ని చెత్తల బళ్లవాళ్లు ఎత్తుకుపోయారు. ఊరిలో సగం మంది యువకులు కటకటాల వెనక్కి వెళ్లారు. వారం నాడు ఎటువంటి ఆర్భాటం లేకుండా మరిడిమాంబ అనుపు పండుగ జరిగిపోయింది.

పాప తమ ఇంట కాలు పెట్టి పదిరోజులు గడుస్తున్నా తన బంధువులు ఎవరూ వెతుక్కుంటూ రాలేదు. పరమేశం పోలీసు స్టేషన్‌కి వెళ్లి తప్పిపోయిన పిల్లల వివరాలు తెలుసుకొన్నాడు. ఫోటోలు చూసాడు. వాటిలో తమ ఇంట ఉన్న పాప ఫోటో లేదు. పొరుగూరిలో ఉన్న పెద్ద లైబ్రరీకి వెళ్లి రెండు, మూడు వారాల క్రితం నాటి దిన పత్రికలన్నీ తిరగేసి చూశాడు. వాటిలో తప్పిపోయిన పాప కోసం ఎటువంటి విజ్ఞప్తి లేదు.



ఈలోగా ఇంట్లో పాప కాంతానికి మాలిమి అయింది. పిల్లలతో కలిసి ఆట పాటలు మొదలు పెట్టింది. రోజులు, వారాలు మారుతున్నా, పాప సమస్యకి పరిష్కార మార్గం కనిపించలేదు పరమేశానికి. అతడు పదే పదే పోలీసు స్టేషనుకు పోయి వాకబు చేస్తుండడంతో అక్కడి వారు విసిగి, ''మాకు తమ పిల్ల తప్పిపోయినట్లు బంధువుల నుంచి ఫిర్యాదు రాందే మేమేం చెయ్యలేమండి. ఉంచుకోవాలనుకుంటే మీ ఇంట ఉంచుకోండి. లేదంటే ఏ అనాథ శరణాలయానికో, చైల్డ్‌వెల్‌ఫేర్ సెంటరుకో పంపేయ్యండి'' అంటూ తెగేసి చెప్పారు.

పాపని ఎక్కడికైనా పంపించివేయడానికి కాంతమ్మ ఎంత మాత్రం ఒప్పుకోలేదు. ''ఎవరూ రాకపోతే పోనీండి. మన ఇంట్లో మన పిల్లలతో పాటే తనూ పెరుగుతుంది. ఆడపిల్ల లేని నాకు ఆ కొరత తీరడానికి మారిడిమాంబ తల్లే ఈ పిల్లని మన దగ్గరకి ఇలా పంపింది అనుకొందాము'' అంది.

కాంతమ్మ అయితే అలా సంతోషపడి, పాపని తన బిడ్డలతో కలిపేసుకోగలిగింది కానీ, పరమేశం అలా అనుకోలేదు. పాప బంధువులెవరో తెలుసుకోవాలి. వారికి వారి పిల్లని అప్పజెప్పాలి. ఒక మనిషిగా అది తన కనీస బాధ్యత అనుకొన్నాడు. మిత్రుల సలహాపై చివరి ప్రయత్నంగా బాగా ప్రచారంలో ఉన్న ఒక ప్రముఖ దినపత్రికలో పాప ఫోటో, వివరాలతో ఆ ప్రకటన వేయించాడు.

అది జరిగి కూడా అయిదారు నెలలు గడిచిపోయింది. పరిస్థితిలో ఎటువంటి మార్పు కనిపించక పోవడంతో, ఇంక పాప తమదే అన్న భావం, నమ్మకం పరమేశం, కాంతమ్మలకే కాక, పాప ఉదంతం తెలిసిన చుట్టుపక్కల వారికి కూడా కలిగింది. ఆ ఉత్సాహంతో ఆరోజు పాప పుట్టినరోజు పండగ ఆ ఇంట్లో సంతోషంగా జరుపుకుంటుంటే, ఆ సమయంలో ఎవడో, ఎక్కడివాడో తెలియని వ్యక్తి వచ్చి ఏదో కథ చెపుతున్నాడు. అతడు నిజంగా పాప బంధువే అయితే అతడితో పాపని పంపించడానికి పరమేశానికి ఎటువంటి అభ్యంతరం ఉండదు. అలా కాక అతడు మోసగాడై పేపరు ప్రకటన చూసి, దాని ఆధారంగా ఏదో కథ లల్లి చెప్పి, పిల్లని తీసుకుపోవాలనుకుంటే, అటువంటి పాచికలేం తన దగ్గర పారవని అతడికి నిస్సంకోచంగా తెలియ జెప్పాలి అనుకున్నాడు పరమేశం. అతడు తన ఆలోచనల్లో తాను సతమతమవుతుంటే, ముసలాయన ఎటో చూస్తూ తన కథ చెపుతున్నాడు.

తన ఒక్కగానొక్క కూతురి గురించి చెపుతున్నాడు. అల్లుడిగా చేసుకొన్న మేనల్లుడి గురించి చెపుతున్నాడు. కొడుకూ, కోడలితో పాటూ, మాడిమసైన తన తోడబుట్టిన దాని గురించి, బావ గురించి చెపుతున్నాడు. ఈ ఘోర వార్త వినగానే ప్రాణం వదిలిన గుండెజబ్బు మనిషి భార్య గురించి చెపుతున్నాడు. తనది అనుకున్న సంసారం అంతా ఒక్క సారిగా అలా కుప్పకూలిపోయి జీవితం శ్మశాన సదృశ్యంగా మారిపోవడంతో, ఆ

వైరాగ్యంతో తను దేశాలు పట్టుకు తిరిగిన తిరుగుళ్ల గురించి చెపుతున్నాడు.

అతడు తన మనమరాలి వివరాలు చెబుతుంటే పరమేశం గుండెల్లో రైళ్లు పరుగులు తీసాయి. అతడి కళ్ల ముందున్న ఆశల సౌధం విరిగి పడి ఛిన్నాభిన్నం అయింది. అతడు చెపుతున్న మనుమరాలి వర్ణన, పాప పోలికలతో చాలా వరకు కలిసి వస్తోంది. పేపరులో పడ్డ ఆ చిన్న ఫోటో చూసి, అంత వివరంగా పిల్ల అందచందాలు, హావ భావాలు వర్ణించి చెప్పడం ఎంత కల్పనాశక్తి ఉన్న వారికైనా సాధ్యపడే విషయం కాదు.

ముసలాయన తన కథనం ముగించి, పై బట్టతో మరోసారి కళ్లు తుడుచుకున్నాడు. ఈసారి పరమేశానికి అతి నటనలా అనిపించలేదు. అవి దొంగ కన్నీళ్లలా కనిపించలేదు. అతడి పట్ల మొదట్లో ఏర్పడిన సంశయం, భావాలు క్రమంగా తొలగిపోయి, వాటిస్థానంలో సానుభూతి చోటు చేసుకుంది.

భర్త, ముందు వాకిలి వరండాలో చాలా సేపు ఎవరితోనో మాట్లాడుతూ ఉండిపోవడం కాంతమ్మ గమనించింది. వచ్చింది ఎవరా? అని అటు చూడ వచ్చింది. భర్త ఎదురుగా ఎవరో అపరిచిత వ్యక్తి. అక్కడే నిలబడి పరిశీలనగా అతడి వంక చూసింది. పరమేశం భార్యని అతడికి పరిచయం చేశాడు. ''ఈయన రంగస్వామిగారని.... చాలా దూరం నుంచి మనల్ని చూడ్డానికి వచ్చారు'' అన్నాడు. ఆ పరిస్థితిలో భార్య ముఖం చూస్తూ అతడు పాప కోసం వచ్చాడని చెప్పలేక పోయాడు పరమేశం.

''అయ్యో! అంత దూరం నుంచి మనపై అభిమానంతో ఆయన చూడవస్తే, ఇంతసేపూ ఊరికే కూర్చోబెట్టి మాట్లాడుతున్నారా? నన్ను పిలిస్తే కాస్త కాఫీ, టిఫిను తెచ్చి పెట్టేదాన్ని కదా'' అంటూ కాంతమ్మ లోపలకి వెళ్లి ఒక ప్లేట్లో రెండు పెరుగ్గారెలు, చిన్న గిన్నెలో పాయసం, ఒక గ్లాసులో మంచినీళ్లు తెచ్చి అతడి ముందు పెట్టి 'తీసుకోండి' అంది.

''ఇప్పుడు ఈ శ్రమంతా దేనికమ్మా'' అన్నాడు అతడు మొహమాటపడుతూ.

''శ్రమకేముందండీ! ఈరోజు మా పాప పుట్టిన రోజు. అనుకోకుండా వచ్చిన అతిథి దైవసమానుడు అంటారు పెద్దలు. మీరు తింటూ ఉండండి. కాఫీ తెస్తాను. మీ చేత్తో పాప తలపై నాలుగు అక్షింతలు వేసి మరీ వెళ్లండి'' అని కాఫీ తేవడానికి లోపలకి వెళ్లింది కాంతమ్మ.

''ఈరోజు మా పాప పుట్టినరోజు'' అని భార్య అన్నప్పుడు ముసలాయన ఆమె అంటున్నదేమిటో అర్థం కానట్లు అయోమయంగా ఆమె వైపు చూడ్డం పరమేశం గుర్తించాడు.

''పాప ఎప్పుడు పుట్టిందో మాకు తెలియదు. మా ఇంటికి వచ్చి ఈనాటికి ఏడాది అయింది. అందుకే మా ఆవిడ ఈ రోజు పాప పుట్టినరోజు పండుగ జరిపిస్తోంది'' అన్నాడు.

ఎండ చల్లబడింది. పాపకి తలదువ్వి, పట్టు పావడా కట్టి, మెడలో తన మూడు వరుసల ముత్యాలహారం వేసి, బొట్టూ కాటుక, బుగ్గన దిష్టి తగలకుండా చుక్క పెట్టి అలంకరించింది కాంతమ్మ. ఇరుగు పొరుగు ఇల్లాళ్లు పేరంటానికి వచ్చారు. వాళ్లు కూర్చవడానికి మధ్య హాలులో చాపలుపరిచారు. కుర్చీలో పాపని కూర్చోబెట్టి దిష్టి తీసి, హారతి పట్టారు. పేరంటాళ్లు కలగలుపు గొంతుతో 'పాపని నిండు నూరేళ్లు సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో సుఖంగా జీవించమని దీవిస్తూ పాడుతున్న పాటలు ముందు వరండాలోకి వినిపిస్తున్నాయి. ముసలాయన కళ్లు మూసుకొని తృప్తిగా ఆ పాటలు వింటున్నాడు. అతడి ముఖంలో ముందున్న విషాదం ఇప్పుడు కనిపించ లేదు. టిఫిను తిని, కాఫీ తాగాక మనిషి కాస్త కోలుకున్నాడు అనుకొన్నాడు పరమేశం.

''రండి. మా ఆవిడ పిలుస్తోంది. మనం కూడా వెళ్లి అక్షితలు వేసి వద్దాం'' అంటూ అతన్ని లేవదీసాడు.

మగవాళ్లు హాలులోకి రావడం చూసి, ఆడంగులు పక్కకి తప్పుకొని, వారికి దారి ఇచ్చారు. కాంతమ్మ ముందు కొచ్చి, వారి చేతిలో అక్షతలు ఉంచింది. ఎదురుగా కుర్చీలో పాప, చుట్టూ ఉన్న పిల్లల మధ్య చుక్కల్లో చంద్రుడిలా మెరిసిపోతోంది. అసలే అందమైన పిల్ల. కాంతమ్మ చేసిన అలంకరణతో చూడ్డానికి రెండు కళ్లూ చాలవన్నట్లు ఉంది.

కన్నార్పకుండా పాప వంకే చూస్తున్నాడు అతడు. అతడి కళ్ల వంకే చూస్తున్నాడు పరమేశం. క్షణకాలం అతడి చూపుల్లో హరివిల్లు రంగులు మెరిసాయి. అతడి ముఖంలో సంతోష తరంగాలు పరవళ్లు తొక్కాయి.

'అయిపోయింది భయపడినంతా అయింది. అతను తన మనుమరాల్ని పోల్చుకున్నాడు. ఇంక తనతో తీసుకుపోతాడు' అనుకున్నాడు పరమేశం బాధగా. అంతలోనే ముసలాయన ముఖంలో రంగులు మారాయి. క్షణ కాలం కింద హరివిల్లు రంగులు మెరిసిన కళ్లల్లో నిరాశా మేఘాలు కమ్ముకొన్నాయి. ఆ మార్పుకి కారణం ఏమిటో పరమేశానికి అంతు బట్టలేదు.

అతడు పాపని పోల్చుకున్నాడా? లేదా అన్నది ప్రశ్న కాదు. పాప అతన్ని పోల్చుకొంటుందా? లేదా అన్నదే పరమేశం పెట్టుకున్న గీటు రాయి. దాని కోసమే ఆత్రంగా అతడు పాప వైపు చూస్తున్నాడు.

పరమేశంతోపాటు ఇంకొక వ్యక్తి హాలులో కాలు పెట్టినప్పుడే పాప ముఖకవళికల్లో ఏదో మార్పు వచ్చింది. కూర్చున్నా ఇబ్బందిగా కదలసాగింది. వాళ్లు తనకు దగ్గరగా రాబోతూంటే ముసలాయన వంక పరీక్షగా పట్టి పట్టి చూసింది. కొద్ది సేపు ఆ కళ్లల్లో ఏదో చెప్పలేని భావం. ఏదో జ్ఞాపకాల అలజడి. అది గుర్తింపే అనుకున్నాడు పరమేశం. అతడి మనసు గాలి తీసిన బెలూన్‌లా అయిపోయింది. ఇక ఏ క్షణంలోనైనా పాప కుర్చీలోంచి లేచి వచ్చి 'తాతా!' అంటూ ముసలాయన చేతుల్లో వాలిపోతుంది అనుకున్నాడు.

సంతోషమే మూర్తీభవించినట్లు పేరంటాళ్ల మధ్య తిరుగుతున్న భార్యని చూస్తే అతడికి జాలి వేసింది. పాపం! పిచ్చిది. పాపపై ఎంత మమత పెంచుకుంది. ఎన్ని ఆశలు పెట్టుకుంది. మరి కొద్ది సేపట్లో ఈ పాప తనకి శాశ్వతంగా దూరం కాబోతోంది అని తెలిస్తే, ఈ ఆనందం అంతా ఏమైపోతుంది? ఆ నిరాశలో ఎలా బ్రతుకుతుంది? అనుకున్నాడు.

పాప కళ్లల్లో కదలాడిన ఆ భావం ఒక క్షణ కాలం మాత్రమే అక్కడ నిలిచింది. మరుక్షణంలో అతడి నుంచి పూర్తిగా చూపు తిప్పేసుకుంది. కొత్త వాళ్లని చూస్తే చిన్న పిల్లలు బిడియంతో తల్లి కొంగు చాటున ముఖం దాచుకొని దాగొనేటట్లు కాంతమ్మ పైట కొంగులో దూరిపోయింది. ''ఎందుకే అంత సిగ్గు? కొత్తవారు ఎవరున్నారనీ?'' అంటూ పాప బుగ్గ పుణికి ముద్దు పెట్టుకుంది కాంతమ్మ.



## కథాంతరంగం

తెలుగింటి ఆత్మీయతలూ అనుబంధాలు, ఆప్యాయతలు, అనురాగాలంటే నాకు చాలా ఇష్టం. రచనలలో మానవ సంబంధాలను, చిన్న చిన్న స్పందనలను చిత్రీకరించడం అంటే ఇంకా ఇష్టం. ఈ ఇష్టాలతోనే నేను రచనా వ్యాసంగం ప్రారంభించాను. రాసిన కథలన్నింటిలోనూ ఈ ఇష్టాలకే ప్రాధాన్యత కల్పించాను. కథల్లో నాటకీయత ఉండాలి. ఉంటేనే బాగుంటుంది. పాఠకుడికి ఉత్కంఠను కలిగిస్తుంది. ఈ నా అభిప్రాయానికి కూడా నా కథల్లో పెద్ద పీట వేశాను. వీటన్నిటి సమాహారమే 'మనస్వి'. ఈ కథను ఎందుకు రాశానంటే...ప్రేమలు పెంచుకుంటే బాగుంటాయి. తుంచుకోవాల్సి వచ్చినప్పుడు విలవిల్లాడిపోతాం. ఆ 'విలవిల'నే ఈ కథలో జాగ్రత్తగా రాశాను. అలాగే 'పెద్ద మనసు' అంటే ఎలా ఉంటుందో... పెద్ద మనసు అంటే అర్థం ఏమిటో ఈ కథలో చెప్పాను. పెంపకపు మమకారాన్ని కూడా జోడించాను. ఈ కథను ఆ రోజుల్లో చాలా మంది మెచ్చుకున్నారు. మంచి కథన్నారు. ఆ మంచేమిటో...కథేమిటో మీరే చదివి తెలుసుకోండి!!

-ద్వివేదుల విశాలాక్షి

ముసలాయన భారంగా నిట్టూర్చాడు. అందులోని విషాదాన్ని పరమేశం ఒక్కడే గుర్తించగలిగాడు. అతడి వంక జాలిగా చూసాడు. పాపని దీవించి, తలపై అక్షతలు వేసి ఇద్దరూ తిరిగి ముందు చావిట్లోకి వచ్చారు. 'భగవంతుడు దయామయుడు' అన్నాడు అతడు. ఆ మాట తనలో తనే అనుకొన్నంత నెమ్మదిగా అన్నాడు. అతనికి ఎదురుగా కుర్చీలో వచ్చి కూర్చున్నాడు పరమేశం.

"పాపని చూశారు కదా? ఏమంటారు?'' అన్నాడు మాటలు మొదలుపెడుతూ,

"పోలికలు చాలా ఉన్నాయి. పాపని చూడగానే నా మనసు సంతోషంతో పొంగి పోయింది. నా ఒంటరి బ్రతుక్కి ఒక తోడు దొరికినట్లు అనిపించింది. క్షణకాలం పాటు నా మనుమరాలే అనుకొన్నాను. 'తాతా' అంటూ వచ్చి, నా కాళ్లని వాటేసుకొంటుంది అనుకొన్నాను. కానీ.....''

"కాదంటారా?'' సంశయంగా ప్రశ్నించాడు పరమేశం.

"కాదు'' అన్నట్లు తల అడ్డంగా ఊపాడు అతను.

"మరి చాలా పోలికలు ఉన్నాయంటున్నారు?''

పరమేశం ప్రశ్నని అతడు వినిపించుకోలేదు. కాంతమ్మ ఇచ్చిన వాయినాలు పుచ్చుకొని పేరంటాళ్లు ఇళ్లకి పోతూ ముందు వాకిట్లోకి వచ్చారు. వాళ్ల వెనుకగా పిల్లలు. అది వాళ్ల ఆట సమయం. ఎదురుగా ఉన్న స్కూలు ఆట స్థలంలో ఆడుకోవడానికి వెళుతున్నారు. వాళ్లల్లో పాప కూడా ఉంది.

"జాగ్రత్తగా చూసుకు నడువు. పావడా కుచ్చెళ్లు కాలిలో పడితే పడిపోతావు. రోడ్డు దాటుతున్నప్పుడు అన్నయ్య చెయ్యి గట్టిగా పట్టుకో'' కాంతమ్మ పాపకి జాగ్రత్తలు చెపుతోంది.

పాప మీద కళ్లు తిప్పుకోకుండా, ఆ పిల్ల ప్రతి కదలికనూ ముచ్చటగా చూస్తున్నాడు ముసలాయన. ఆ పిల్ల తన మనుమరాలు కాకుండా పోయింది అన్న విచారం అప్పుడు అతడి ముఖంలో కనిపించడం లేదు. అతడి కళ్లలో నీటి పొర లేదు. వాటిలో ఆనందతరంగాలు డోలలాడుతున్నాయి.

"మీకింకా సంశయమేదైనా ఉంటే ఒక పని చెయ్యండి'' అన్నాడు పరమేశం. ఇదే మీకు నేను ఇస్తున్న చివరి అవకాశం అన్నట్లు.

"చెప్పండి'' అన్నాడు అతడు పాప మీద నుంచి దృష్టి మళ్లించకుండానే.

"మీరు, మీ మనుమరాల్ని ఇంట్లో ముద్దుగా పిలుచుకునే పేరేదో ఉంటుంది కదా. ఆ పేరు పెట్టి పిలవండి. పాప వెనుదిరిగి చూస్తుందేమో. అది తన పేరుగా గుర్తిస్తుందేమో చూద్దాం'' అన్నాడు పరమేశం.

కొద్దిసేపు సాలోచనగా కళ్లు మూసుకున్నాడు అతడు. అంతలో ఏదో నిర్ణయించుకున్నట్లు కూర్చుని 'నిర్మల తన పేరు, 'నిమ్మి' అని పిలిచేవారం అంతా' అన్నాడు.

"అలాగే పిలవండి'' అంటూ తొందరచేసాడు పరమేశం.

అప్పటికే పిల్లలు వీధి గుమ్మం దాటి వెళ్లిపోతున్నారు.

"నిమ్మీ... నిమ్మీ! ఒకసారి ఇలారా తల్లీ!'' అంటూ ఆప్యాయంగా పిలిచాడు అతడు. గుంపుగా వెళుతున్న పిల్లల్లో ఒకరిద్దరు వెనుదిరిగి అతడు అలా పిలుస్తున్నది ఎవర్నా అన్నట్లు చూసారు. వాళ్లల్లో పాప లేదు.

"నేనింక వెళ్లొస్తాను'' అంటూ లేచాడు. అతడు తను వచ్చిన పని అయిపోయింది అన్నట్లు.

"ఈ రాత్రికి ఉండి రేపు వెళ్లరాదూ? బాగా అలసిపోయినట్లు ఉన్నారు'' అంది కాంతమ్మ.

"ఇప్పుడుకాదు. ఇంకొకసారి వస్తాను'' అని క్షణకాలం ఆగి, "మీ ఆతిథ్యానికి ధన్యవాదాలు. మీ వంటి దంపతుల చేతుల్లో పడ్డ పాప అదృష్టవంతురాలు. ఆ భగవంతుడు పాపనీ, మిమ్మల్ని ఆయురారోగ్యాలతో పది కాలాపాటు చల్లగా చూడాలి'' అంటూ దీవించాడు.

"పదండి మిమ్మల్ని బస్సెక్కించి వస్తాను. బజార్లో నాకూ కొంచెం పని ఉంది'' అంటూ తనూ అతనితో పాటే నడిచాడు పరమేశం.

వాళ్లు బస్టాండుకు చేరే సరికి అతడు వెళ్లవలసిన బస్సు కదలడానికి సిద్ధంగా ఉంది. అతడు అందులో ఎక్కి కిటికీ పక్కగా ఉన్న సీటులో కూర్చున్నాడు. పరమేశం కింద నిలబడి అతడి వంక చూస్తున్నాడు. అతడు తమ ఇంట కాలు పెట్టినప్పటి నుంచి జరిగిన సంఘటనలన్నీ ఒకటొకటిగా అతడి మనసులో కదులుతున్నాయి. కొన్ని గంటలకి పూర్వం అతడెవరో? తనెవరో? ఈ కొద్ది సమయంలో అతడు తనకెంతో ఆప్తుడయినట్లు అనిపిస్తోంది. పాప అతడి మనుమరాలు కాకపోయినందుకూ, ఎంతో ఆశతో వచ్చిన అతడు అలా రిక్తహస్తాలతో తిరిగి వెళ్తున్నందుకు మనసులో ఎంతో బాధపడ్డాడు.

"మీరుఎప్పుడైనా ఇటు వైపు వస్తే తప్పక మా ఇంటికి రండి'' అన్నాడు వీడ్కోలుగా.

డ్రైవరు స్టీరింగు ముందు కూర్చున్నాడు. బస్సు కదలబోతోంది.

"చిన్నమాట'' అన్నాడు అతడుకిటికీలోంచి కొంచెం ముందుకు వంగి.

ఏమిటన్నట్లు చూసాడు పరమేశం.

"ఇందాక మీ ఇంట్లో పాపని 'నిమ్మి' అని నేను పిలిస్తే పలకలేదు కదూ. 'కిట్టూ' అని పిలవండి పలుకుతుంది. వాళ్లమ్మ దాన్ని అలాగే పిలిచేది. దాని పూర్తి పేరు 'కృష్ణప్రియ' అన్నాడు అతడు నెమ్మదిగా.

"బాబుగారూ'' అన్నాడు పరమేశం రెండు చేతులూ పైకెత్తి అతడికి దండం పెడుతూ. బస్సు రొద చేస్తు కదిలింది.

"కిట్టూ పుట్టినరోజు ఈ సారి మండు వేసవిలో కాదు. చల్లని చలికాలంలో సంక్రాంతి రోజు చెయ్యండి''ప్రతిగా చెయ్యి ఊపుతూ గట్టిగా అన్నాడు అతడు.

ధూళిచిమ్ముతూ బస్సు ముందుకి కదిలింది. ఆశ్చర్యం నుంచి కోలుకున్న పరమేశం ఇంటి ముఖం పట్టాడు.

★

